క్లుప్తంగా

బాధితురాలికి చెక్కు అందజేత

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ–2 డిపోలో పని చేసిన మెకానిక్ రాజునాయక్ మృతిచెందడంతో ఆయన భార్య వసంతకు సోమవారం డీఎం ఆర్సీ నిరంజన్ ఇన్సూరెన్సు స్కీం కింద రూ.5,72,393 చెక్కును అందజేశారు. 2021 మే నెలలో రాజునాయక్ అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎం అప్పిరెడ్డి, సీఐ గీతా, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డి కమ్యూనిటీ బలోపేతానికి కృషి చేయండి

మదనపల్లె : రెడ్డి కమ్యూనిటీ బలోపేతానికి కృషిచేయాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు సురేంద్రరెడ్డి సూచించారు. సోమవారం మదనపల్లెకు వచ్చిన ఆయనను ఆ సంఘం నాయకులు శ్రీధర్‌రెడ్డి, మధుకరరెడ్డి, వెంకటరమణారెడ్డి, హనుమంతురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పద్మారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లె రెడ్డి కమ్యూనిటీకి సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. కమ్యూనిటీని ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేయాల్సిందిగా నాయకులకు సూచించారు.

ఉచిత కంటి పరీక్షలు

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ అభయ, హార్సిలీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు చేశారు. విద్యార్థులకు అవసరమైన కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, లయన్స్ సభ్యులు మహేంద్ర, పీడీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఆర్‌ఐ

పెద్దతిప్పసముద్రం: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని దొంతి క్రిష్టప్ప వీధికి చెందిన మౌలాసాబ్ ఇల్లు కూలిపోయింది. సోమవారం ఎంపీపీ మహమూద్, ఎంపీటీసీ చంద్రశేఖర్ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌ఐ అనీషా కూలిన గృహాన్ని పరిశీలించి పరిహారం మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి కొత్తగా ప్రభుత్వ పక్కా గృహం మంజూరు చేయించారు.

ట్రాన్స్‌కో సీటీఎం సెక్షన్ ఏఈగా రమేష్

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం సెక్షన్ ట్రాన్స్‌కో ఏఈగా రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై సీటీఎం సెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఏఈని నార్త్ సెక్షన్ ఏఈ నరసింహారెడ్డి, విద్యుత్ ఓసీ అసోసియేషన్ నాయకులు శేషాద్రి నాగరాజు, అర్జున, రవీంద్రరాజులు అభినందించారు.

30న ఉచిత రక్తదాన శిబిరం

వాల్మీకిపురం: ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ఆయుష్మాన్ భవలో భాగంగా ఆరోగ్య మేళాను నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజా బేగం తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 30వ తేది స్థానిక ప్రభుత్వాసుపత్రి లో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఆరోగ్యవంతులైన 18 సంవత్సరాలుపైబడిన యువత, మహిళలు, పురుషులు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీగా యోగానంద్

పెద్దతిప్పసముద్రం: మండల ఈవోఆర్డీగా యోగానంద్ నియమితులైనట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఈయన గతంలో అనంతపురం జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఈవోఆర్డీ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది.

వెంకన్న స్వామివారికి పవిత్ర సమర్పణ

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్వామివారికి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌లు శాస్త్రోత్తంగా, సంప్రదాయబద్ధంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. చతుష్టార్చనం నిర్వహించారు. అనంతరం పవిత్రాలను మేళతాలాల వాయిద్యాలతో గుడి చుట్టూ తిప్పి శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామికి, ప్రసన్న ఆంజనేయ స్వామికి, 12 మంది మూలదారులకు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయ సూపరింటెండెంట్ మునిచంగల్‌రాయులు, ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, వేదపారాయణదారులు అమరనాథ్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ కే.ప్రమీల అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని 35వార్డుల్లో ప్రజాసమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా... మున్సిపల్ షాపురూములకు సంబంధించి తాను కట్టిన డిపాజిట్ తిరిగి ఇవ్వాల్సిందిగా వి.ప్రకాష్ కోరారు. ఇంటిపక్కవారు నివాసప్రాంతాల్లో ఆవులకు పాక నిర్మించడంతో ఆవుపేడ, చెత్తాచెదారాలతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారై, దోమల బెడద అధికంగా ఉందని ఎం.పతి ఫిర్యాదుచేశారు. ఇంటి ముందు మురుగుకాలువలో ఇసుక, బురద సుమారు ఆరు అడుగులకు పైగా పూడిపోయినందున మురికి నీళ్లు ఇంటిలోపలకు వస్తున్నాయని షేక్‌ఖాదర్‌వలీ ఫిర్యాదుచేశారు. బుగ్గకాలువలో గడ్డి విపరీతంగా పెరగడంతో చుట్టుపక్కల పాములు, విషపురుగులు అధికమయ్యాయని, సమస్యను పరిష్కరించాల్సిందిగా ఫాతిమా కోరారు. కార్యక్రమంలో డీఈ శ్రావణి, ఏఈ బండపల్లిశిరీషా పాల్గొన్నారు.

పరిశుభ్రతలో జిల్లాను ఆదర్శంగా నిలుపుదాం

–డీపీఓ మిద్దింటి ధనలక్ష్మి


పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న డీపీఓ ధనలక్ష్మి, ఎంపీపీ శ్రీదేవి, తదితరులు

కలకడ : పంచాయతీల పరిశుభ్రతలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లాను ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ రాజ్‌అధికారి మిద్దింటి ధనలక్ష్మి అన్నారు. సోమవారం కలకడ సచివాలయం పరిధిలోని క్లాప్‌మిత్రాను సన్మానించి వారి సేవలను కొనియాడారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. చెత్త సేకరణ లక్ష్యంగా పెట్టుకుని చెత్త నుంచి సంపదను తయారు చేసి పంచాయతీల ఆదాయం పెంచడానికి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం కె.బాటవారిపల్లె పంచాయతీ కె.మాదిగపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ ప్యారీజాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షావత్‌అలీఖాన్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, సీడీపీఓ రాజమ్మ, సూపర్‌వైజర్ శాంతబాయ్, సిబ్బంది సుమతి, నాగమ్మ, ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శిగా రాజు


పి.ఎస్.ఎం. రాజును సన్మానిస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

పీలేరు రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా పి.ఎస్.ఎం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రాయచోటి ఆర్‌ఎం కార్యాలయంలో ఎన్‌ఎంయూ నూతన పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గతంలో పీలేరు డిపోలో ఎన్‌ఎంయూ కార్యదర్శిగా 9 సంవత్సరాలు పని చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ఎన్‌ఎంయూ కమిటీ పి.ఎస్.ఎం. రాజును జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అనంతరం డీపీటీవో రాము సమక్షంలో పలువురు యూనియన్ నాయకులు రాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు సి.వి.రమణ, నాగరాజ, కె.ఎస్. మణ్యం, రాధారాణి, భారతి, ప్రమీల, జయంతి, తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకానికి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్సీ నిరంజన్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7.15 బయలుదేరి 9.45కు కాణిపాకం చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి కాణిపాకంకు 4.15 కు చేరుకుంటుందన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు అన్నారు. సోమవారం బెంగుళూరుకు చెందిన మోకోరేటా కంపెనీ విద్యార్థులకు హార్డ్‌వేర్ టెక్నాలజీపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హార్డ్‌వేర్ టెక్నాలజీని ఉపయోగించుకుని భవిష్యత్తులో ముందుకెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడి వరప్రసాద్, వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

కేవీపల్లె : గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సమతుల ఆహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, భారతి అన్నారు. సోమవారం మండలంలోని మిన్నంరెడ్డి గారిపల్లె, గ్యారంపల్లెలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత తగ్గించుకోవడానికి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గ్రుడ్లుతో కూడిన సరైన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు, వాటివల్ల కలిగే అనర్థాలు గూర్చి అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

ప్రాచీన సంప్రదాయాలను గౌరవిద్దాం

మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి


గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : ప్రాచీన సంప్రదాయాలను గౌరవిద్దామని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీకి సన్మానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పీలేరులో గణేష్ ఊరేగింపు, నిమజ్జనం అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతం చేయడంతోపాటు టీటీడీ ఎస్వీబీసీ చానల్‌లో ప్రసారం కావడానికి కృషి చేసిన సర్పంచ్ హబీబ్‌బాషా, ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనీయులన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాచీన జానపద నృత్యాలు అలరించాయని పేర్కొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, రమణ, శ్రీధర్, మోహన్‌రెడ్డిలను, కూచిపూడి కళాకారిణి హరితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, వైస్ ఎంపీపీ చలపతి, నాయకులు కాలేషా, రామకృష్ణారెడ్డి, రమణ, పెద్దోడు, శ్రీనాథరెడ్డి, పి.వి.ఎస్. లక్ష్మీ, మునీర్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, అబిద్, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశానికి కాంగ్రెస్ చారిత్రాత్మక అవసరం

– ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌతమ్


మాట్లాడుతున్న జంగాగౌతమ్

మదనపల్లె : ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక అవసరమని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌతమ్ అన్నారు. సోమవారం మదనపల్లె కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాగౌతమ్ మాట్లాడుతూ..దేశసమైక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం నిలబడాలంటే, అన్నివర్గాలు, మతాలు, కులాలు, ప్రాంతాలు, బాషలు, సంస్కృతులు సగౌరవంగా దేశంలో బతకాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఏపీకి బీజేపీ ద్రోహం చేసిందన్న విషయం రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీలకు తెలిసినా, వారి వ్యక్తిగత స్వార్థాలు, కేసుల భయంతో బీజేపీకి భయపడి సాగిలపడటం జరుగుతోందన్నారు. రాష్ట్రవిభజన సమయంలో కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌కు రూ.5లక్షల కోట్ల విలువైన ప్రయోజనాలను ప్రకటించిందని, ప్రస్తుతం వాటివిలువ రూ.10లక్షల కోట్ల వరకు పెరిగేలా ప్రత్యేకచట్టం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ఏపీకి ప్రత్యేకహోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని సూచిస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ వాటన్నంటినీ మరుగున పడేసి తీరనిద్రోహం చేసిందన్నారు. సమావేశంలో భాగంగా డాక్టర్.ఎస్.కే.బాషాతో పాటుగా కొంత మంది నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మదనపల్లె కన్వీనర్ లీలాశ్రీనివాస్, తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్ర, మంజుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలపై విస్తృత ప్రచారం


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ లోకవర్ధన్

కేవీపల్లె : ఆరోగ్య పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సోమవారం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సిబ్బందితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో విప్లవాత్మక పథకాలు ప్రవేశ పెట్టిందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంలో ప్రతి వ్యక్తికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి గర్భవతికి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన, ఆరోగ్య ఆసరా, తల్లిబిడ్డ వాహన సేవల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చే అందరినీ ఎలక్ట్రానిక్ హెల్త్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్యామల, డాక్టర్ రేష్మ సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్‌ఎన్ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పురుషోత్తం, రుక్మిణి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దనే వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి

కలికిరి: ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రోగులకు ఇంటి వద్దనే వైద్య సేవలు పొందే సదావకాశం కలిగిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. మండలంలోని పత్తేగడ గ్రామం నగిరిపల్లిలో సోమవారం ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి అనారోగ్య సమస్యలున్న వారికి గుర్తించి, అటువంటి వారికి క్యాంపులో స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య పరీక్షలు, వైద్య సదుపాయాలు కల్పించే బృహత్తర కార్యక్రమం తీసుకురావడం గర్వకారణమన్నారు. 162 రకాల మందులు, 14 రకాల ఏమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంటాయని, వైద్యాధికారులు, సిబ్బంది పేదలకు ఉత్తమైన వైద్యసేవలందివ్వాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో అండర్ –14,16 బాల,బాలికల వాలీబాల్, టెన్నీకాయిట్ జట్ల ఎంపిక జరిగింది. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయిలో అడుతారన్నారు. కార్యక్రమంలో పీడీలు పాల్గొన్నారు.

తూనికలు కొలతల్లో వ్యత్యాసాలు వస్తే చర్యలు

పీలేరు రూరల్ : తూనికలు కొలతల్లో వ్యత్యాసాలు వస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికల, కొలతల అధికారి ఎన్. నాగరాజ్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ చౌకదుకాణాల్లో తూనికల యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 56 ప్రభుత్వ చౌకదుకాణాలు ఉన్నాయని, ప్రతి చౌకదుకాణంలోనూ తూనిక మిషన్లను పరిశీలించి వెరిఫికేషన్ సర్టిఫికేషన్ ఇవ్వడంతోపాటు ప్రతి యంత్రానికి ముద్ర వేస్తున్నట్లు తెలిపారు. తూనికలు, కొలతల్లో ఎలాంటి అవకతవకాలు జరిగినా 9885217776 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

రామసముద్రం: మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని ఆదర్శపాఠశాల విద్యార్థులు అండర్–17 వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్ తెలిపారు. వాలీబాల్ పోటీల్లో వాసు, వరనరసింహ, శ్రీధర్, తేజశ్రీలు నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అలాగే అండర్–14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో నోమిషా అనే విద్యార్థి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

తంబళ్లపల్లె: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని హౌసింగ్ ఈఈ వెంకటదాస్ తెలిపారు. సోమవారం షిరిడిసాయి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీలో 75 ఇండ్లు మంజూరు చేయగా 35 పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. వివిధ స్థాయిలలో ఉన్న మిగిలిన ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు పూర్తిస్థాయిలో జరగడంతో సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట డీఈ శ్రీహరిరావు, ఏఈ సుజాత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శేషాద్రి తదితరులు ఉన్నారు.

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయండి

మదనపల్లె సిటీ: ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా ఉర్దూ మానిటరింగ్ అధికారి హాషీం టీచర్లను కోరారు. సోమవారం స్థానిక ఇసుకనూతిపల్లెలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యాప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని టీచర్లను కోరారు. టీచర్లు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన ఎస్పీ


స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బి క్రిష్టారావు

పెద్దమండ్యం: తంబళ్లపల్లె, పెద్దంమద్యం, ములకలచెరువు పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ బొడ్డేపల్లె క్రిష్టారావు సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లో ఉన్న గదులను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలు, గ్రామాల పరిస్థితిపై ఆరా తీశారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలు, రౌడీ షీటర్‌లు, సస్పెక్టెడ్ షీట్ ఉన్న వారిపట్ల నిఘా ఉంచాలని సూచించారు. స్టేషన్‌లలో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట మదనపల్లె డీఎస్పీ కేశప్ప, ములకలచెరువు ఇన్‌చార్జి పీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు రామాంజనేయుడు, గాయత్రి, లోకేష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధ్యులపై కఠిన చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్ కుమార్

కలికిరి: రోడ్డు ప్రమాద బాధ్యులపై ఇకపై కఠిన చర్యలుంటాయని వాల్మీకిపురం సీఐ సురేష్ కుమార్ అన్నారు. కలికిరి పట్టణంలో సోమవారం వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలలో పరిమితికి మించి కూర్చోవడం, పట్టణంలో అతివేగం, హెల్మెట్ ధరించని వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రధానంగా యువత ద్విచక్రవాహనాలలో వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవ్వడమే కాకుండా ఇతరుల ప్రాణాలు బలిగొంటున్నారని, మైనర్‌లకు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చిన వారిపైనా చర్యలుంటాయన్నారు. కార్యక్రమాలలో ఎస్‌ఐ కె.రహీముల్లా, ఏఎస్‌ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ మనోహర్, పీసీలు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మదనపల్లె : జనసంఘ్ వ్యవస్థాపకులు దీన్‌దయాళ్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆయన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండిఆనంద్ తెలిపారు. బీజేపీ మదనపల్లె ఆధ్వర్యంలో సోమవారం దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. పట్టణకమిటీ అధ్యక్షులు జర్మన్‌రాజు ఆధ్వర్యంలో సొసైటీకాలనీలో జరిగిన కార్యక్రమంలో బండి ఆనంద్, బీజేపీ నాయకులు దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే 14వవార్డులో ఎల్లంపల్లెప్రశాంత్ ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిరణ్, బాలకృష్ణ, రెడ్డిశేఖర్, కృపానంద, మల్లినాయక్, వెంకటేష్, సునీల్, బాబ్జీ, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలి

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ముంబైలో సోమవారం జాతీయ సీనియర్ సిటిజన్స్ సమాఖ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయో వృద్ధుల వేధింపుల నివారణకు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. వృద్ధుల ఆరోగ్య విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక మంత్రి త్వశాఖను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు బదనీ, మాజీ అధ్యక్షులు చాప్‌కే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఉమ

పీలేరు రూరల్ : మండలంలోని మూరేవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజరు ఉమ మాట్లాడుతూ ఆకు కూరలు, వివిధ కాలాల్లో లభించే పండ్లు ఆహారంగా తీసుకోవాలన్నారు. సూక్ష్మ పోషకాలు, పీచు పదార్థం కలిగిన ఆహారం ఆరోగ్యానికి మంచిదన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ ద్వారా 1/3 వంతు పోషకాలు అందుతాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, జ్యోతి, ఉషారాణి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నీట మునిగిన పూరిగుడిసెలు


గుంతయంబాడిలో వరదనీటిలో పూరిగుడిసెలు


గాలివానకు కూలిన విద్యుత్ స్తంభాలు

రామసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రెండు పూరిగుడిసెలలోకి నీరు చేరడంతో ఇంటి సామగ్రితో వీధిన పడిన సంఘటన కెసి.పల్లి పంచాయతీ గుంతయంబాడిలో చోటు చేసుకుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలోకి వర్షపునీరు చేరడంతో ఉపాధ్యాయులు , విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. గుంతయంబాడి గ్రామానికి చెందిన సోమశేఖర్, సుభద్రమ్మలు రెండు కుటుంబాలు పూరిగుడిసెలో నివాసం ఉంటున్నారు. అయితే రాత్రి కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతంలోని ఉన్న కొట్టకుంట నిండి మొరవపోవడంతో కాలువలో నీరు పొంది గ్రామంలోని లోతట్టు ప్రాంతానికి భారీగా వరద వచ్చింది. దీంతో అర్ధరాత్రి వరదనీరు నివాసం ఉన్న గుడిసెలలోకి చేరడంతో కుటుంబ సభ్యులు చిన్న పిల్లలతో సహా వర్షంలో నిద్రలు లేకుండా జాగరణ చేయాల్సి వచ్చింది.

కూలిన విద్యుత్ స్తంభాలు

ములకలచెరువు: మండలంలో సోమవారం తెల్లవారి జామున కురిసిన గాలి, వానకు మూడు విద్యుత్‌స్తంభాలు నేలకు వరిగాయి. బురకాయలకోటలో రెండు, ములకలచెరువులో ఒక విద్యుత్ స్తంభం కూలినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకున్నారు.